క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



దీక్ష చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

విజయనగరం ఫోర్ట్: దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఉద్యోగులు స్థానిక దాసన్నపేటలో ఉన్న విద్యుత్‌భవన్ వద్ద గురువారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ జేఏసీ చైర్మన్ డి. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, ఉద్యోగులకు 45 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలన్నారు. గ్రేడ్-2 జేఎల్‌ఎంలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు, చనిపోయిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు త్రినాథరావు, శశికళ, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తుబ్రిడ్జి జంక్షన్ ఆధునికీకరణకు చర్యలు

విజయనగరం: జిల్లా కేంద్రంలో గల ఎత్తుబ్రిడ్జి జంక్షన్ ఆధునికీకరణకు చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు అన్నారు. ఈ మేరకు విశాఖ – విజయనగరం మార్గంలో గల జంక్షన్ ఆధునీకరణ పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో కలిసి గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభసాటి



మాట్లాడుతున్న ఉద్యానవనశాఖ అధికారి జ్యోత్స్న

పూసపాటిరేగ: ఆయిల్‌పామ్ సాగు రైతులకు లాభసాటిగా ఉంటుందని భోగాపురం ఉద్యానవనశాఖ అధికారి జ్యోత్స్న అన్నారు. మండలంలోని కొల్లాయివలసలో మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌పై గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు హెక్టార్‌కు ఏడాదికి 5,250 రూపాయలు చొప్పున రాయితీ అందిస్తామన్నారు. జిల్లాలో ఈ ఏడాదికి 600 హెక్టార్లలో కొత్తగా ఆయిల్ పామ్ సాగుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కొల్లాయివలస సర్పంచ్ పైడి సుజాత, ప్రజాప్రతినిధులు తాడిశెట్టి బాబు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన



పతివాడలో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలిస్తున్న మండల విద్యాశాఖ అధికారులు

పూసపాటిరేగ: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారులు ఎ. రాజ్‌కుమార్, బి. పాపినాయుడు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పతివాడ ఉన్నత పాఠశాల, పేరాపురం గొల్లపేట ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు – నేడు పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిశీలనలో జేఈ వెంకటరమణ, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం టి. రామారావు, తదితరులున్నారు.

కుష్టును ప్రాథమిక స్థాయిలోనే గుర్తించాలి



కుష్టు రోగులకు అవగాహన కల్పిస్తున్న హీల్ ప్రాజెక్ట్ అధికారి తాలాడ దీప్తి

విజయనగరం టౌన్: కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలని హీల్ ప్రాజెక్ట్ అధికారిణి తాలాడ దీప్తి సూచించారు. గురువారం స్థానిక పూల్‌బాగ్‌లోని లెప్రసీ కాలనీలో నివాసం ఉంటున్న కుష్టు రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్పర్శ లేని మచ్చలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ప్రతినిధులు, కుష్టువ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతులకు ఉపాధి కలిగించే పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టేట్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ జీబీవీ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మహిళా ప్రాంగణంలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మహిళలకు బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, ఫాబ్రిక్ పెయింటింగ్ అండ్ మగ్గం వర్క్ కోర్సులలో 30 రోజుల శిక్షణ ఉంటుందని తెలిపారు. వసతి, భోజన సౌకర్యాలు కలిప్తామన్నారు. 45 ఏళ్లలోపున్న గ్రామీణ ప్రాంత మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ లోపు దరఖాస్తులను కార్యాలయానికి పంపాలని కోరారు. పూర్తి వివరాల కోసం 99595 21662, 96426 18599 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అవినీతిరహిత పాలన జగనన్నతోనే సాధ్యం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



49వ డివిజన్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ,తదితరులు

విజయనగరం: రాష్ట్రంలో అవినీతిరహిత పాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. అర్హతే ప్రామాణికంగా పూర్తి పారదర్శకతతో సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. నగరంలోని 49వ డివిజన్ 59వ సచివాలయ పరిధి గాజులరేగలోని గొల్లవీధి ప్రాంతంలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, నగరంలో జరుగుతున్న అభివృద్ధి వంటి విషయాలను లబ్ధిదారులకు వివరించారు. అలాగే స్థానిక సమస్యలపై ఆరా తీస్తూ వాటి పరిష్కారానికి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, డివిజన్ ఇన్‌చార్జ్ కె. రాజా మాట్లాడుతూ, ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వం రూపొందించిన సంక్షేమ క్యాలెండర్ ప్రకారం పథకాలు అందుతున్నాయని చెప్పారు. నవరత్నాలు అమలులో భాగంగా అనేక సంక్షేమ పథకాలను ప్రకటించడమే కాకుండా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతిపక్ష టీడీపీ కల్లబొల్లి కబుర్లు చెబుతూ పబ్బం గడుపుకుంటోందని ఆరోపించారు. లంచగొండితనం, అవినీతి లేకుండా పథకాలన్నీ నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే మంజూరు కావడం విప్లవాత్మకమైన మార్పుని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, కార్పొరేటర్లు నడిపిల్లి ఆదినారాయణ, పట్టా ఆదిలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు మధు, తదితరులు పాల్గొన్నారు.

11వ డివిజన్‌లో....

నగరంలోని 11వ డివిజన్ అశోక్‌నగర్ కబర్‌స్తాన్ గేట్ నుంచి ప్రారంభమైన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావు పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ఏ విధంగా అందుతున్నాయని ప్రశ్నిస్తూ, స్థానిక సమస్యలపై ఆరా తీస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు వి.శ్రీనివాసరావు, డివిజన్ యూత్ అధ్యక్షుడు నవీన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ఆదర్శ పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పథకాలను అందిస్తూ ప్రజారంజక పాలన సాగిస్తున్నారన్నారు. గతానికి భిన్నంగా నగరం ఎంతో అభివృద్ధి చెందడానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కారణమని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



11వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న మేయర్ విజయలక్ష్మి, తదితరులు

అభివృద్ధి ప్రదాతకు అండగా నిలవండి..



నెల్లిమర్ల రూరల్: బర్లపేటలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన అభివృద్ధి ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అందరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని చనమల్లుపేట, బర్లపేట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేసిన, చేస్తున్న మంచిని ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత దేశంలో సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు తమను సంతోషంగా ఆహ్వానిస్తున్నారని, సంక్షేమ పాలనలో భాగస్వామ్యమైనందుకు గర్వపడుతున్నామన్నారు. గడప గడపకు కార్యక్రమం ద్వారా క్షేత్ర స్థాయిలో గుర్తించిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూడలేకపోతున్న ప్రతిపక్షాలు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని ఆరోపించారు. అబద్ధపు హామీలతో మోసం చేసేందుకు అంతా ఏకమై వస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ఓటుతో వారికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం చనమల్లుపేట గ్రామంలో జమ్ము శ్రీను, మీసాల సీతారాం, సన్యాసి, తదితర 20 టీడీపీ కుటుంబాలు ఎమ్మెల్యే బడ్డుకొండ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జమ్ము అప్పలనాయుడు, సర్పంచ్ జమ్ము సన్యాసమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు చనమల్లు స్వాతి, నాయకులు చనమల్ల సూర్యానారాయణ, గోవిందరావు, సత్తిబాబు, తులసి, మత్స శ్రీనివాసరావు, అంబళ్ల కిరణ్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సరికొత్త చరిత్ర

- ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధే లక్ష్యం
- ఉచితంగా 11 రకాల ప్రభుత్వ సేవలు
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ఒక చరిత్ర సృష్టించిందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అర్హులెవ్వరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందకుండా మిగిలిపోరాదన్న లక్ష్యంతో ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. రెండు దశల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టి, అర్హులను గుర్తించి అవసరమైన ధ్రువపత్రాలను ఉచితంగా అందించామన్నారు. జూలై 1 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 15,004 సచివాలయాల్లో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించామని తెలిపారు. మొత్తం 1.46 కోట్ల కుటుంబాలను వలంటీర్లు సర్వే చేశారని, వారికి ఏ విధమైన సేవలు కావాలో నమోదు చేసుకున్నారని తెలిపారు. మొత్తం 93.5 లక్షలకు పైగా అభ్యర్థులకు అవసరమైన ధ్రువపత్రాలు జారీ చేశామన్నారు. ఇందులో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు 45.33 లక్షలు, ఆదాయ ధ్రువీకరణ 41.50 లక్షలు, ఆధార్ నవీకరణ 2.72 లక్షలు, రెవెన్యూ హక్కులకు సంబంధించి 2.70 లక్షలు, అడంగల్ పత్రాలు 1.40 లక్షలు చొప్పున అందించామన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన 1.69 లక్షల మంది వలంటీర్లు, 1200 మండల అధికారులు, సచివాలయ సిబ్బందికి.. పర్యవేక్షించిన ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ వంద శాతం పథకాలను అందజేయాలన్నదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న సుపరిపాలనను ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, ఫ్లోర్‌లీడర్ ఎస్వీవీ రాజేష్, జోనల్ ఇన్‌చార్జ్‌లు కృష్ణారావు, డాక్టర్ వీఎస్ ప్రసాద్, సంగంరెడ్డి బంగారునాయుడు, ముద్దాడ మధు, అల్లు చాణక్య, యవర్ణ కుమారస్వామి, ముచ్చు శ్రీను యాదవ్, కాళ్ల సూరిబాబు, బోడసింగి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, పక్కన వైఎస్సార్‌సీపీ నాయకులు

పక్కాగా ఓటర్ల సర్వే



పూల్‌బాగ్ కాలనీలో ఇంటింటి సర్వే

విజయనగరం రూరల్: ఓటర్ల జాబితా పక్కాగా రూపొందించాలని, ఇందుకోసం బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేపట్టి వివరాలు నమోదు చేసుకోవాలని కేఆర్‌సీ తహసీల్దార్, ఏఈఆర్‌ఓ టి. రామకృష్ణ తెలిపారు. నియోజకవర్గంలోని 149 పోలింగ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న ఇంటింటి సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. సుమారు 200 గృహాలను సందర్శించి ఓటర్ల సర్వేను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఓటర్ల అభ్యర్థనలను పరిగణలోకి తీసుకుని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, ఫారం 6 ద్వారా నూతన ఓటర్లను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఏవరైనా ఇళ్లు మారినా ఫారం- 8 ద్వారా మార్పు చేయాలని సూచించారు. ఎవరైనా చనిపోతే పేర్లు తొలగింపులో మరణ ధ్రువీకరణ పత్రం ఆధారంగా ఫారం- 7 ద్వారా తొలగించాలన్నారు. ఆరోపణలకు తావులేని విధంగా సర్వే చేసి ఓటర్ల జాబితా రూపొందించాలని సూచించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి, తదితరులు

విజయనగరం: చారిత్రాత్మక నగరంగా పేరొందిన విజయనగరంలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రధానంగా నగర ప్రజలందరికీ తాగు నీరందించడమే ధ్యేయంగా చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని కేఎల్ పురం ప్రాంతంలో రూ.99 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న పైప్‌లైన్ పనులతో పాటు 44, 45వ డివిజన్‌లలో రూ. 34 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపనలు చేశారు. అలాగే కేఎల్ పురం , అయ్యన్నపేట ప్రాంతాల్లో రహదారులు, కాలువల నిర్మాణ పనులు, పైపులైన్ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ తాళ్లపూడి సంతోషికుమారి, సీనియర్ సిటిజన్ నాయకుడు గిడుతూరి పైడితల్లి మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లనాటి సమస్యలను కూడా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పరిష్కరిస్తున్నారని చెప్పారు. కేఎల్ పురం ప్రాంతవాసుల దాహార్తిని తీర్చేందుకు రూ.2 కోట్ల వ్యయంతో వాటర్ ట్యాంక్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా రూ.99 లక్షలతో పైప్‌లైన్ పనులను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, జోనల్ ఇన్‌చార్జ్‌లు దూబే, కొసర నారాయణ, తమ్ము, వైఎస్సార్‌సీపీ తాళ్లపూడి పండు, సైలాడ సత్యనారాయణ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

స్నేహపూర్వక వాతావరణం కల్పించాలి

- రిజిస్ట్రార్ డాక్టర్ పెదిరెడ్ల పల్లవి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి

నెల్లిమర్ల రూరల్: సీనియర్లు, నూతన విద్యార్థులకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పెదిరెడ్ల పల్లవి సూచించారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ర్యాగింగ్‌పై కఠిన చట్టాలు అమల్లో ఉన్నాయని, చాలా ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారికి కనీసం ఆరు నెలల నుంచి 10 సంవత్సరాల వరకు జైలుశిక్ష పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ రమణారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



కమిషనర్ శ్రీరాములునాయుడుకు సమస్యలు వివరిస్తున్న యూనియన్ నాయకులు

విజయనగరం: మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములునాయుడుకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎస్. రంగరాజు, జలగడుగుల కామేష్ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ డిమాండ్లపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి. శ్రీను, కె. శ్రీను, డి.మజ్జిరాజు, కె. చిరంజీవి, ఆర్. రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్థిక కార్యాలయాల సముదాయం ప్రారంభం

విజయనగరం అర్బన్: నగరంలోని కలెక్టర్ కార్యాలయ సమీపంలో కొత్తగా నిర్మించిన ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యాలయాల సముదాయాన్ని (ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ కాంప్లెక్స్) విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ఆర్థిక మంత్రి బొగ్గన రాజేంద్రనాథ్ శుక్రవారం ప్రారంభిస్తారని జిల్లా ఖజానా లెక్కల అధికారి ఆర్ఎఎస్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా సుధాకర్

విజయనగరం క్రైమ్: ఎక్సైజ్ శాఖలో జిల్లా సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సుధాకర్‌కు విశాఖ ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్‌గా తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకూ అక్కడ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న బి.శ్రీనివాసులకు అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. ఆయన్ను రిలీవ్ చేయమని వచ్చిన ఉత్తర్వుల మేరకు అతన్ని రిలీవ్ చేసి, ఆ బాధ్యతలను సుధాకర్ తాత్కాలికంగా చేపట్టారు.

సంపూర్ణ ఆరోగ్యమే జగనన్న ధ్యేయం

- మేయర్ వెంపడాపు విజయలక్ష్మి



విజయనగరం: తల్లీబిడ్డలకు వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లు అందజేస్తున్న మేయర్, తదితరులు



విజయనగరం రూరల్: కార్యక్రమంలో మాట్లాడుతున్న రాకోడు పీహెచ్‌సీ సిబ్బంది



నెల్లిమర్ల రూరల్: గర్భిణులకు రేషన్ అందజేస్తున్న నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, మద్దిల వాసు, తదితరులు



విజయనగరం ఫోర్ట్: లబ్ధిదారులకు కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్ రంగారావు



భోగాపురం: టేక్ హోమ్ రేషన్ కిట్లను అందజేస్తున్న సర్పంచ్ రమణ, సీడీపీఓ ఎస్తేరు రాణి, తదితరులు



డెంకాడ: కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ ఎస్తేరురాణి

విజయనగరం: భవిష్యత్ తరాలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. తల్లీ,బిడ్డల మేలు కాంక్షిస్తూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. నగరంలోని 11వ డివిజన్ అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన టేక్ హోమ్ రేషన్ గొప్ప కార్యక్రమమని చెప్పారు. ఒక్కొక్కరికీ సుమారు రూ.1010 విలువైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంపడాపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన ఆహారం

విజయనగరం రూరల్: భావితరాలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నట్లు దుప్పాడ సర్పంచ్ కె. లక్ష్మి తెలిపారు. దుప్పాడ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యురాలు కెల్ల కృష్ణవేణి, తదితరులు గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ ద్వారా సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా రాకోడు పీహెచ్‌సీ సిబ్బంది మాట్లాడుతూ, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు పౌష్టికాహారం

విజయనగరం ఫోర్ట్: తల్లిపాలే బిడ్డకు మంచి పౌష్టికాహారమని 33 డివిజన్ కార్పొరేటర్ జీవీ రంగారావు అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా ఐసీడీఎస్ 5వ సెక్టార్ పరిధి నాగోజీపేట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని సూచించారు. అనంతరం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి. అనురాధ, కార్యకర్త నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

కిట్లు పంపిణీ..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని జరజాపుపేట అంగన్‌వాడీ కేంద్రంలో పలువురు గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, స్థానిక పెద్దల చేతుల మీదుగా గర్భిణులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో నాగవంశం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిల వాసు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముర్రుపాలు శ్రేయస్కరం..

భోగాపురం: అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లి ముర్రుపాలే శ్రేయస్కరమని, వాటివల్ల వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్తేరురాణి తెలిపారు. మండలంలోని రెడ్డికంచేరులో బైరెడ్డిపాలెం, చేపలకంచేరు అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు టేక్ హోమ్ రేషన్ అందించారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ, తల్లిపాల ఆవశ్యకత, పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బైరెడ్డి రమణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు డీబీ రెడ్డి, ఏసీడీపీఓ తవిటినాయుడు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎంతో మేలు..

డెంకాడ: తల్లిపాలు బిడ్డకు చాలా మేలు చేస్తాయని ఐసీడీఎస్ భోగాపురం సెక్టార్ సీడీపీఓ ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని జొన్నాడ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి, లబ్ధిదారులకు టేక్ హోమ్ రేషన్ (వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు) అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరాడ రమణి, ఎంపీటీసీ సభ్యురాలు త్రిపురగిరి దేవి, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

వెంపడాం పీఏసీఎస్ అధ్యక్షుడిగా సత్యనారాయణ



సత్యనారాయణను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

పూసపాటిరేగ: మండలంలోని వెంపడాం ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘ అధ్యక్షుడిగా వాళ్లె సత్యనారాయణని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గురువారం ఉదయం స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో సత్యనారాయణ పదవీ బాధ్యతలు స్వీకరించారు. అలాగే మెంబర్లుగా బొబ్బాది సూరినాయుడు, పతివాడ కన్నంనాయుడులను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శి ఎ. వెంకట సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నింటి ఎల్లంనాయుడు, పిన్నింటి నారాయణప్పడు, పిన్నింటి ఆదినారాయణ, గుడివాడ అక్కునాయుడు, వాళ్లె భాస్కరరావు, పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని చనమల్లుపేట గ్రామంలో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు సంప్రదాయ పంటల వైపే కాకుండా ఉద్యాన పంటల వైపు కూడా దృష్టి సారించాలన్నారు. అనంతరం పలువురు రైతులకు ఆయిల్ పామ్ మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, జమ్ము అప్పలనాయుడు, పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, రేగాన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.